'పెద్ది' ఐటెం సాంగ్ రాయడానికి 50 రోజులు పట్టింది: అనంత శ్రీరామ్

ప్రస్తుతం 'పెద్ది' సినిమా కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రామ్ చరణ్ హీరోగా బుచ్చి బాబు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమాలోని ఐటెం సాంగ్ గురించి గేయ రచయిత అనంత శ్రీరామ్ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ''తెలుగులో ఏఆర్ రెహమాన్‌కు నేను 30 పాటలు రాశాను. ప్రతి పాట కొత్తగానే అందించాను. ప్రయోగాలకు ఆయన ఎప్పుడూ పెద్దపీట వేస్తారు. 'పెద్ది'లో ఐటెం సాంగ్ అదిరిపోతుంది. ఆ పాట రాయడానికి నాకు 50 రోజుల సమయం పట్టింది. రెహమాన్ బాణీల్లో ఇప్పటివరకూ వచ్చినదాని కంటే కొత్త తరహా ప్రయోగం చేశారు. ఐటెం సాంగ్‌కూ ఇలాంటి బాణీలు ఇవ్వొచ్చా? అని మేం ఆశ్చర్య పోయాం. ఆ ట్యూన్ వింటూనే 5 రోజులు గడిపేశాం. తర్వాత లిరిక్స్ కూడా ఇద్దరు మనుషులు మాట్లా డుకుంటున్నట్లుగా రాశాను. ఇక 'పెద్ది'లో 'రైరా రారా' పాట విని చిరంజీవి ఫోన్ చేశారు. 'నా జీవితాన్ని నేను చూసుకున్నట్లు ఉంది. పూర్తిగా నేను ఆలోచించే ఫిలాసఫీని ఇప్పటి కాలానికి తగినట్లు అందించావు' అని చిరంజీవి అనడం నా జీవితంలో మర్చిపోలేని ప్రశంస'' అని అనంత శ్రీరామ్ తెలిపారు. పెద్ది ఐటెం సాంగ్ మే 23న విడుదల చేయనున్నారు. దీని కోసం భోపాల్‌లో గ్రాండ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. ఏఆర్ రెహమాన్‌తో లైవ్ కాన్సర్ట్ ఏర్పాటు చేసి అందులో ఈ పాటను ప్రదర్శించనున్నారు. ఈ వేడుకకు ముందు.. 'పెద్ది' టీమ్ మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలవనుంది. తాజాగా ఈ సాంగ్ ప్రోమోను టీమ్ విడుదల చేసింది. 'చీర.. చొక్కా.. చిక్కెడిపోవాలంటూ..' సాగే లిరిక్స్ యూత్‌ను ఆకట్టుకుంటున్నాయి.

పోలీసులకు అనసూయ, విష్ణుప్రియ ఫిర్యాదులు

టాలీవుడ్ సెలబ్రిటీలు అనసూయ , విష్ణుప్రియ పోలీసులకు వేర్వేరుగా శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఒకరు నేరుగా స్టేషన్‌కెళ్లి కంప్లైట్ చేయగా.. మరొకరు సోషల్ మీడియా వేదికగా ట్యాగ్ చేశారు. ఏం జరిగిందంటే? తన గురించి తప్పుడు ప్రచారం చేస్తోందంటూ ఓ యూట్యూబ్ ఛానల్‌పై మియాపూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు విష్ణుప్రియ. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. "ఆమె కూడా ఓ అమ్మాయి (విష్ణుప్రియ గురించి మాట్లాడిన అమ్మాయి). అయినా, ఇండస్ట్రీకి చెందిన మహిళల గురించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతోంది. ఆమెపై చర్యలు తీసుకోవాలనుకున్నా. అందులో భాగంగానే కంప్లైట్ ఇచ్చా. ఆమే కాదు ఇలా చాలామంది ఉన్నారు. వారిపైనా యాక్షన్ తీసుకుంటా" అని హెచ్చరించారు.

అనసూయ ఏఐ ఫొటోలు..

తనను అసభ్యకర రీతిలో చూపిస్తూ ఏఐ ఫొటోలను సృష్టిస్తున్నారంటూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌ను ఎక్స్ వేదికగా ట్యాగ్ చేశారు అనసూయ. ''సర్.. ఇలాంటి వాటిని పట్టించుకోకుండా ఉండాలని ప్రయత్నించా. కానీ, ఈ ప్రొఫైల్‌లో తరచూ.. నా ఏఐ జనరేటెడ్ ఇమేజ్‌లను పోస్టు చేస్తున్నారు'' అంటూ సంబంధిత ఎక్స్ హ్యాండిల్ వివరాలను సజ్జనార్ ఖాతాను ట్యాగ్ చేశారు. దీనిపై ఆయన వెంటనే స్పందించి.. హైదరాబాద్ సైబర్‌క్రైమ్ బ్రాంచ్‌ను సంప్రదించి, ఫిర్యాదు చేయమని సూచించారు. సమన్వయం చేసుకోవాలంటూ 'హైదరాబాద్ సిటీ పోలీస్' ఖాతాను ట్యాగ్ చేశారు. ఈ క్రమంలో కొందరు విమర్శిస్తూ పోస్టులు పెట్టగా.. తనదైన శైలిలో సమాధానాలిచ్చారు అనసూయ.

టైమ్ వచ్చినప్పుడు నేనే లీక్ చేస్తా: చిరంజీవి

'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి దర్శకుడు బాబీ కాంబినేషన్‌లో 'మెగా 158' (వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. గురువారం లాంఛనంగా ప్రారంభమైన ఈ మూవీకి సంబంధించి స్పెషల్ వీడియో తాజాగా విడుదలైంది. 'ది స్పిరిట్ ఆఫ్ మెగా 158' పేరిట రిలీజ్ అయిన ఈ వీడియో అందరినీ అలరించేలా ఉంది. ఈ సినిమా టైటిల్‌ని చిరంజీవి చెప్పాలనుకోగా.. దర్శకుడు ఇప్పుడే వద్దంటూ ఆపడం నవ్వులు పూయించింది. ''వాళ్లు చెప్పొద్దంటే ఆగిపోతామా? టైమ్ వచ్చినప్పుడు నేనే లీక్ చేస్తా. అప్పటి వరకూ వెయిట్ చేయండి. సూపర్ టైటిల్'' అంటూ చిరు సందడి చేశారు. ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ఈరోజు (మే 22) మొదలైంది.

మమ్ముట్టి, మోహన్‌లాల్ 'పేట్రియాట్'.. ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్

మలయాళ అగ్ర హీరోలు మమ్ముట్టి , మోహన్‌లాల్ కలిసి నటించిన సినిమా 'పేట్రియాట్' . ఈ మూవీ ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. 'జీ 5' (Zee 5)లో జూన్ 5 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగు ఆడియో కూడా అందుబాటులో ఉండనుంది. దేశభక్తితో కూడిన యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. నయనతార, ఫహద్ ఫాజిల్ లాంటి స్టార్లు కీలక పాత్రలు పోషించారు.

ఈ సినిమా కథేంటంటే? కేరళకు చెందిన డాక్టర్ డేనియల్ జేమ్స్ (మమ్ముట్టి) డీఆర్‌డీవో ఆఫీసర్. ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసే ల్యాప్‌టాప్‌ల ద్వారా ముప్పు పొంచి ఉందంటూ.. మంత్రి తనయుడు, శక్తి కార్పొరేషన్ అధినేత శక్తి సుందరం (ఫహద్ ఫాజిల్) చేపట్టిన కార్యక్రమాన్ని అడ్డుకుంటాడు. ఈ క్రమంలో ఆయనపై దేశద్రోహి అన్న ముద్ర పడుతుంది. అదే సమయంలో లండన్ వెళ్లి.. తన స్నేహితుడు కర్నల్ రహీమ్ నాయక్‌ను (మోహన్‌లాల్) కలుస్తాడు. వీరిద్దరూ కలిసి రాజకీయ నాయకుల కుట్రను ఎలా బయటపెట్టారు? దేశ భద్రతను కాపాడే క్రమంలో ఎదురైన సవాళ్లేంటి? వీరికి లాయర్ లతిక (నయనతార) ఎలాంటి సపోర్ట్ ఇచ్చింది? అన్న అంశాలతో దర్శకుడు మహేశ్ నారాయణన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇప్పటికే థియేటర్లలో విడుదలైంది.

ప్రమాణాలు పెరిగాయి.. ఇప్పుడు ఏ జట్టుకైనా కష్టమే: అశ్విన్

విశ్వంభర, స్పోర్ట్స్ : ఐపీఎల్‌లో ఐదేసి కప్పులను నెగ్గిన చెన్నై సూపర్ కింగ్స్, ముంబయి ఇండియన్స్ హవా గత కొన్ని సీజన్లలో తగ్గుముఖం పట్టింది. కొత్త టీమ్‌లు దూసుకొస్తున్నాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్.. ఇలా ప్రతి జట్టూ తమ సత్తా చాటుతున్నాయి. దీనికి కారణం ఐపీఎల్ ప్రమాణాలు అత్యుత్తమ స్థాయికి చేరుకోవడమేనని మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ''ఐపీఎల్ టోర్నీ జరిగే కొద్దీ క్లిష్టంగా మారుతోంది. ఏ జట్టు కూడా ఎక్కువ వ్యూహాత్మక తప్పిదాలు చేయడం లేదు. వేలంలో మంచి ఆటగాళ్లను ఎంపిక చేసుకోవడం నుంచి హోం గ్రౌండ్ అడ్వాంటేజ్‌తో వ్యూహాలను పన్నుతున్నాయి. అందుకే, ఐదేళ్లలో రెండు లేదా మూడు టైటిళ్లు గెలవడం ఇప్పుడు తేలికైన విషయం కాదు'' అని అశ్విన్ వ్యాఖ్యానించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో సీఎస్‌కే, ముంబయి గ్రూప్ స్టేజ్‌కే పరిమితమైన సంగతి తెలిసిందే.

సీఎస్‌కే వాటిపై పెట్టుబడి పెట్టాలి..

ధోని హయాంలో జట్టంతా సమతూకంగా ఉండేది. ఇకనైనా సీఎస్‌కే జట్టు అన్ని విభాగాలను బ్యాలెన్స్ చేసుకోవాలని అశ్విన్ సూచించాడు. ''సీఎస్‌కే ఇకనైనా నాణ్యతపై ఇన్వెస్ట్ చేయాలి. క్వాలిటీ క్రికెటర్లను ఎంపిక చేసుకోవాలి. దాని ఉద్దేశం ఇంకాస్త అనుభవం కలిగిన వారికి అవకాశమివ్వాలి. బౌలింగ్‌లో ఈసారి ఎక్కువ అనుభవం లేదు. ఫాస్ట్, స్పిన్ బౌలింగ్‌లో వైవిధ్యం కనిపించాలి. యువ క్రికెటర్లు ఉండటం మంచిదే. కానీ, అందరూ అలాంటి వారయితే, ఇబ్బందులు తప్పవు. ఈ సీజన్‌లో శివమ్ దూబే బ్యాటింగ్ సీఎస్‌కే సానుకూలాంశం. ఇప్పుడున్నవారికి చెపాక్ మైదానం కూడా సూట్ కాదు. గతంలో సురేశ్ రైనా, బద్రినాథ్, అంబటి రాయుడు, షేన్ వాట్సన్, మైకెల్ హస్సీ వంటి వారు చెపాక్ పరిస్థితుల్లో ఎలా ఆడాలో ఆడి చూపించారు. అలాగని ఇప్పుడు వారిని తక్కువ చేయడంలేదు. కార్తిక్ శర్మ అద్భుతంగా ఆడాడు. స్పిన్నర్లను కాస్త ఆలస్యంగా ఆడటం అతడి స్పెషాలిటీ. మిగతావారికీ కాస్త అనుభవం రావాలి'' అని అశ్విన్ వెల్లడించాడు.

టెన్షన్ వద్దు.. నేనున్నాగా ఆర్ఆర్ కోచ్‌కు సూర్యవంశీ భరోసా

విశ్వంభర, స్పోర్ట్స్ : హ్యాట్రిక్ ఓటములతో ప్లేఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకున్న రాజస్థాన్ రాయల్స్ ఎట్టకేలకు లఖ్‌నవూపై అద్భుత విజయంతో రేసులోకి వచ్చింది. వైభవ్ సూర్యవంశీ సూపర్ బ్యాటింగ్‌తో అదరగొట్టిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌కు ముందు ఆర్ఆర్ ప్రధాన కోచ్ కుమార సంగక్కర చాలా ఒత్తిడిలో ఉన్నాడని.. వైభవ్ మాత్రం గెలిపిస్తానని అతనికి భరోసా ఇచ్చాడట. ఇదే విషయాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వైభవ్ వెల్లడించాడు. 15 ఏళ్ల కుర్రాడు ఇంత పరిణితితో ఆలోచించడం అద్భుతమని సర్వత్రా ప్రశంసలు వస్తున్నాయి. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ ఆరెంజ్ క్యాప్ రేసులో మూడో స్థానంలో ఉన్నాడు. అతడి ఖాతాలో 579 పరుగులు ఉన్నాయి. ముంబయితో ఆర్ఆర్ మే 24న తన చివరి లీగ్ మ్యాచ్ ఆడాల్సిఉంది. ఇందులో గెలిస్తే నాకౌట్‌కు చేరుకుంటుంది. ''అంతకుముందు మూడు మ్యాచుల్లో మాకు అనుకూలంగా ఫలితం రాలేదు. లఖ్‌నవూతో మ్యాచ్‌లోనూ మాకు భారీ లక్ష్యమే ఎదురైంది. నేను ప్యాడ్లు కట్టుకుని సిద్ధమవుతున్నప్పుడు

మా కోచ్ కుమార సంగక్కరను చూశా. అప్పుడు చాలా టెన్షన్‌గా కనిపించాడు. ఒత్తిడిలో ఉన్నట్లు అనిపించింది. కానీ, నేను మాత్రం చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నా. బాగా ఆడి జట్టును గెలిపించగలనని అనుకున్నా. ఇదే మాటను మా కోచ్‌కు చెప్పా. ఈ పిచ్‌పై ఇదేమీ భారీ స్కోర్ కాదు'' అని వైభవ్ వెల్లడించాడు. లక్ష్యాన్ని వైభవ్ సూర్యవంశీ శివాలెత్తాడు. కేవలం 38 బంతుల్లోనే 93 పరుగులు చేసి రాజస్థాన్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇందులో ఏడు ఫోర్లు, 10 సిక్స్‌లు ఉన్నాయి. ఆ మ్యాచ్‌లో ఆర్ఆర్ ఏడు వికెట్ల తేడాతో సునాయాసంగా గెలిచింది.

యువ సచిన్‌ను చూసినట్లుంది: కిరణ్ మోరె..

''సచిన్ తెందూల్కర్ భారత జట్టులోకి వచ్చినప్పుడు హేమాహేమీ బౌలర్లతో ఢీకొట్టాల్సి వచ్చింది. ఎందుకో అతడు చాలా స్పెషల్ అని అప్పుడే అనుకున్నా. ఇప్పుడు వైభవ్ సూర్యవంశీని చూస్తుంటే నాకు యువ సచిన్ గుర్తుకొచ్చాడు. తప్పకుండా దేశానికి మంచి పేరు తీసుకొస్తాడని అనుకుంటున్నా. క్రికెట్ కోసమే సూర్యవంశీని ఆ దేవుడు తయారుచేసినట్లుగా ఉంది. అతడు ఎలాంటి విధానంలో ఆడుతున్నాడో అలాగే కొనసాగనివ్వాలి'' అని మాజీ క్రికెటర్ కిరణ్ మోరె అభిప్రాయపడ్డారు.

ప్రశాంత్ నీల్ 'ఫ్యామిలీ స్టోరీ'.. అందుకే ఆగిపోయింది!

ప్రశాంత్‌నీల్ సినిమాలనగానే పవర్‌ఫుల్ క్యారెక్టర్లు, హై ఓల్టేజ్ ఎలివేషన్లు గుర్తొస్తాయి. పైగా ఆయన చిత్రాల్లో నలుపు రంగే దర్శనమిస్తూ ఉంటుంది. మరి, ఇలాంటి దర్శకుడు.. కలర్‌ఫుల్‌గా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ తీస్తే ఎలా ఉంటుంది? వాస్తవానికి ఆయన రెండో సినిమా అదే కావాల్సింది. కానీ, ఆ స్థానంలో 'కేజీయఫ్' వచ్చింది. తాను రాసుకున్న

కుటుంబ కథను భవిష్యత్తులోనైనా ప్రశాంత్‌నీల్ తెరకెక్కిస్తారా? అంటే లేదు అని సమాధానం ఇచ్చారు దర్శకుడు. దానికి గల కారణాన్నీ వివరించారు. అది పునీత్ రాజ్‌కుమార్ కోసమే రాసిన కథ అని, ఆయన ఇప్పుడు లేరు కాబట్టి ఆ స్టోరీని పట్టాలెక్కించే ఆలోచన లేదన్నారు. ముందుగా ఫ్యామిలీ స్టోరీతోనే హోంబలే ఫిల్మ్స్ నిర్మాణ సంస్థను సంప్రదించారు ప్రశాంత్‌నీల్. అయితే, సదరు సంస్థ ఫ్యామిలీ మూవీకి బదులు యాక్షన్ చిత్రమైతే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం చేయగా.. ఓ పవర్‌ఫుల్ సీన్‌ను వినిపించారు నీల్. అది ప్రొడ్యూసర్‌కు బాగా నచ్చడంతో.. తర్వాత పూర్తి కథను సిద్ధం చేశారు. అదే 'కేజీయఫ్'. యశ్ హీరోగా.. రెండు భాగాలుగా వచ్చిన ఈ స్టోరీ ఎంత సెన్సేషన్ అయిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా. 'కేజీయఫ్'ను తెరకెక్కించడంతో.. ఆ కుటుంబ కథ వాయిదా పడింది. గుండెపోటుతో పునీత్ రాజ్‌కుమార్ 2021లో మరణించిన సంగతి తెలిసిందే. ప్రశాంత్‌నీల్ చిత్రాల్లో.. పైకి యాక్షన్ కనిపించినా అంతర్లీనంగా ఎమోషన్ ఉంటుంది. ఆ డ్రామానే తన బలం అంటుంటారు నీల్. 'కేజీయఫ్', 'సలార్' తర్వాత ఇప్పుడు ఆయన తెరకెక్కిస్తున్న చిత్రం 'డ్రాగన్' . ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న ఈ మూవీ వచ్చే ఏడాది జూన్ 11న విడుదల కానుంది. ఇప్పటికే ఓ మైథాలజీ స్టోరీ రాశానని, తన కమిట్‌మెంట్స్ అన్నీ పూర్తి కాగానే దాన్ని తెరకెక్కిస్తానంటూ నీల్ ఇటీవల అప్‌డేట్ ఇచ్చారు.

ప్లేఆఫ్స్‌కు వెళ్లే నాలుగో జట్టేది?

విశ్వంభర, స్పోర్ట్స్ : ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్‌లో నాలుగో బెర్తు కోసం రాజస్థాన్ రాయల్స్ (14), పంజాబ్ కింగ్స్ (13), కేకేఆర్ (13), దిల్లీ క్యాపిటల్స్ (12) రేసులో నిలిచాయి. శనివారం, ఆదివారం జరగనున్న మూడు మ్యాచులతో ఆ జట్ల భవితవ్యం తేలనుందిఇప్పటికే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ నాకౌట్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే.

ఆ మూడు మ్యాచులే కీలకం..

- మే 23: లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో పంజాబ్ కింగ్స్ తలపడనుంది. ఏకనా స్టేడియం వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుంది. ఇందులో పంజాబ్ కింగ్స్ గెలిస్తే 15 పాయింట్లతో అప్పటికి నాలుగో స్థానానికి చేరుకుంటుంది. ఒకవేళ ఓడితే ఇంటికే.

మే 24న మధ్యాహ్నం: ఆదివారం డబుల్ బొనాంజా. ఈ రెండూ కీలకమయ్యే అవకాశం లేకపోలేదు. తొలుత ముంబయి ఇండియన్స్‌తో రాజస్థాన్ రాయల్స్ మధ్యాహ్నం 3.30 గంటలకు తలపడనుంది. ఇందులో ఆర్ఆర్ గెలిస్తే.. 16 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు చేరుకుంటుంది. ఇక పంజాబ్, కేకేఆర్, దిల్లీ ఇంటిముఖం పడతాయి. అలాకాకుండా రాజస్థాన్ ఓడిందనుకోండి.. శనివారం పంజాబ్ గెలిచిఉంటే.. ఆ టీమే ముందడుగు వేసే అవకాశం ఉంటుంది.

మే 24న సాయంత్రం: లీగ్ స్టేజ్‌లో ఆఖరి మ్యాచ్ ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్ దిల్లీ క్యాపిటల్స్ మధ్య జరగనుంది. పైన పేర్కొన్నట్లుగా రాజస్థాన్ తమ చివరి మ్యాచుల్లో ఓడితేనే.. ఈ పోరుకు కాస్త విలువ. అలాకాకుండా ఆర్ఆర్ గెలిస్తే మాత్రం కేకేఆర్ మ్యాచ్ నామమాత్రమే అవుతుంది. పంజాబ్, రాజస్థాన్ ఓడిపోయి.. కేకేఆర్ విజయం సాధిస్తే నాకౌట్‌కు చేరుకుంటుంది. దిల్లీ గెలిస్తే మాత్రం మళ్లీ నెట్ రన్‌రేట్ కీలకమవుతుంది. **చివరిగా:** రాజస్థాన్, పంజాబ్ ఓడిపోయి.. దిల్లీతో పోరు వర్షం కారణంగా రద్దైనా సరే కోల్‌కతాకు నాకౌట్ బెర్తు ఛాన్స్ ఉంటుంది. అప్పుడూ ఏ జట్టు నెట్ రన్‌రేట్ ఎక్కువ ఉంటే వారిదే నాలుగో ప్లేస్. ఈడెన్ గార్డెన్స్‌లో ముంబయితో మ్యాచ్‌కూ వరుణుడు కాస్త ఆటంకం కలిగించిన సంగతి తెలిసిందే.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com